# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరుగుతున్న నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించిన గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.**

3. **పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. యస్. జగన్మోహన్ రెడ్డి.**

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలోని భారత్ మండపంలో నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం ఈ రోజు జరుగుతోంది. నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరైయ్యారు. ఈ సమావేశంలో దేశ అభివృద్ధి, రాష్ట్రాల ప్రగతి, కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాధాన్య అంశాలు, కేంద్ర సహకారంతో అమలు చేస్తున్న పలు ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'యోగాంధ్ర' కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈరోజు ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరిగాయి. విశాఖపట్నంలోని నావెల్ డాక్ యార్డ్ వద్ద భారత నౌకాదళం, జిల్లా యంత్రాంగం, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని బారువా బీచ్ వద్ద మత్స్యకారులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. బారువా బీచ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు పశ్చిమగోదావరి జిల్లాలో, భీమవరం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

---------------------------

యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ప్రతి ఒక్కరూ ఆచరించాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. పార్వతీపురంమన్యం జిల్లాలోని తొట్లపల్లి జలాశయం వద్ద నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి కోరుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలో ఏర్పాటు చేయనున్న ప్రయివేట్ ఫ్లైట్ శిక్షణా కేంద్రం నిర్మాణ పనులకు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 2014కు ముందు దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 166కు చేరిందని తెలిపారు. అలాగే 'ఉడాన్' పథకం ద్వారా చిన్న పట్టణాలకు కూడా విమానయాన సేవలు విస్తరించాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో తొలి ఫ్లైట్ ట్రైనింగ్ కేంద్రం ఏర్పాటు కానుండటం రాష్ట్ర విమానయాన రంగ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పురందేశ్వరి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ముద్రణా రంగానికి పారిశ్రామిక హోదా కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యక్రమంలో నిన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముద్రణా రంగ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. ఈ రంగానికి చెందిన నిర్వాహకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక విధానాలతో ముందుకు సాగాలని సూచించారు.

---------------------------

దేశంలో గత పన్నెండేళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం దేశం అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. పన్నెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు రేపు తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాధవ్ వెల్లడించారు. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని ప్రజలకు వివరించే విధంగా సభ ఏర్పాటు చేస్తున్నామని మాధవ్ తెలియజేస్తూ

వాయిస్..30.. సెకన్లు

---------------------------

పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు

చర్యలు తీసుకుంటోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ అమృత్ మిషన్ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి సౌకర్యాన్ని వచ్చే రెండేళ్లలో కల్పిస్తామని వెల్లడించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో సుమారు 20 వేల కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల పనులను జూలై నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై. యస్. జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై రేపు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ విధానాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

వాయిస్..30.. సెకన్లు

--------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనంలో స్వామివారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

--------------------------

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్ హెచ్చరించారు. బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో స్థానిక శాసనసభ్యులు జి.కొండయ్యతో కలిసి ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ రియాజ్ మాట్లాడుతూ, తీర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా లే అవుట్లు, ప్రైవేట్ రిసార్టుల నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు స్థలాలు కొనుగోలు చేసే ముందు ఆయా లే అవుట్లకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

--------------------------

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధీర ప్రసాద్ ఈరోజు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా శృంగవరం గ్రామ శివారులోని పామాయిల్ తోటను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీ కోసం తాజాగా ప్రవేశపెట్టిన యాప్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

======================